WWW.EPAPER.MAHAADAILY.COM
Follow: @ANNTELUGU
ANN తెలుగు
మహా పత్రిక
హైదరాబాద్
01-11-2024 | శుక్రవారం, హైదరాబాద్
మేడ్చల్-మల్కాజ్‌గిరి



## ట్రాఫిక్ గాలికి.. వసూళ్లకు పరుగులు..

- నగరంలో ఎక్కడికక్కడే నిలుస్తున్న ట్రాఫిక్
- సమస్య పరిష్కారంపై ట్రాఫిక్ పోలీసుల దృష్టేది?

02

# ప్రభుత్వ దవాఖానల్లో మందుల కొరత..

## ఉప్ప నీరు తాపించి వాంతి చేయించిన వైద్యులు

**మహా, హైదరాబాద్ :**
రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల పరిస్థితి అధ్వన్నంగా తయారైంది. సూది ఉంటే మందు ఉండదు, మందు ఉంటే సూది ఉండదు. సూది, మందు ఉంటే వైద్యుడు ఉండడు అన్నచందంగా మారిపోయింది. బీఆర్ఎస్ హయాంలో ఓ వెలుగువెలిగిన గవర్నమెంట్ హాస్పిటల్స్ కాంగ్రెస్ పాలనలో మసకబారాయి. తాజాగా వరంగల్‌జిల్లా నర్సంపేటలో ఏర్పాటైన జిల్లా హాస్పిటల్‌లో మందుల కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ మందులు కూడా లేవంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఐవీ సెట్లు కూడా బయట కొనాల్సిన పరిస్థితి ఉంది. రాన్‌ట్యాక్, పాన్‌టాప్, జోఫార్, డైక్లి, డైసైక్లోమిన్, పాం, ఎవిల్ వంటి ఇంజెక్షన్లు, మాత్రలు.. పాము, విషపు పురుగుల కాటుకు గురైతే ఇచ్చే పాం ఇంజెక్షన్లు కూడా లేవు. కడుపు నెప్పి, వాంతులు, ఒంటి నొప్పుల నివారణ మాత్రల్లేవు.. సాధారణ మందులు కూడా లేకపోవడంతో అర్ధరాత్రి పూట వైద్యానికి వెళ్లే రోగులు బయట మందుల షాపులు మూసి ఉండడంతో అవస్థలు పడుతున్నారు.

చెన్నారావు పేటకు చెందిన ఓ వివాహిత పురుగుల మందు తాగి హాస్పిటల్‌లో చేరితే ఆమెకు ఉప్పు నీరు తాపించి వాంతి చేయించారు. కాగా, మందుల కొరతపై హాస్పిటల్ ఆర్ఎంవో స్పందించారు. అవును మందుల కొరత నిజమే, దీనిపై అధికారులకు తెలిపాం. వాళ్లు పట్టించుకోవడం లేదంటూ సమాధానం ఇచ్చాడు. దీంతో రోగుల ప్రాణాలు గాల్లో దీపంగా మారాయి.





ఇంటి ముందు ముగ్గువేస్తున్న వారిపైకి

## దూసుకెళ్లిన కారు.. ఇద్దరికి తీవ్ర గాయాలు..

**మహా, మధ్యప్రదేశ్ :**
మధ్యప్రదేశ్ రాష్ట్రంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఇండోర్‌లో ఓ కారు బీభత్సం సృష్టించింది. ఇంటి ముందు ముగ్గు వేస్తున్న ఓ బాలిక, మహిళపైకి దూసుకెళ్లింది. సోమవారం ఉదయం రద్దీగా ఉన్న ఓ వీధిలో ఇంటి ముందు 14 ఏళ్ల బాలిక, 21 ఏళ్ల మహిళ ముగ్గు వేస్తున్నారు. ఆ సమయంలో అతి వేగంగా వచ్చిన కారు.. అదుపుతప్పి వీరిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటన అనంతరం డ్రైవర్ కారును అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఈ ప్రమాదంలో బాలిక, మహిళకు తీవ్ర గాయాలైనట్లు తెలిసింది.




ప్రైవేట్ ట్రావెల్ బస్సు

## ఢీకొని వ్యక్తి మృతి..

జీడిమెట్లలో ఘటన

**మహా, హైదరాబాద్ :** ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన జీడిమెట్ల పరిధి షాపూర్‌నగర్ చౌరస్తాలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రహదారి దాటుతున్న వ్యక్తిని వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు పాదచారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు.



# పండుగపూట విషాదం..

## హై టెన్షన్ వైర్ తగిలి బాలుడికి తీవ్ర గాయాలు

**మహా, హైదరాబాద్ :**
వెలుగులు నింపాల్సిన దీపావళి పండుగ వారి కుటుంబంలో చీకట్లను మిగిల్చింది. దీపాల పండుగను ఎంతో ఘనంగా జరుపుకోవాలని ఆశపడ్డ వారికి తీవ్ర నిరాశే మిగిలింది. వివరాల్లోకి వెళ్తే.. దీపావళి పండగ సందర్భంగా లైటింగ్ ఏర్పాటు చేస్తుండగా, ఇంటి పైనుంచి వెళ్తున్న హై టెన్షన్ వైర్ తగిలి బాలుడి శరీరం పూర్తిగా కాలిపోయింది. ఈ విషాదకర సంఘటన అంబర్‌పేటలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దీపావళి పండగ సందర్భంగా లైటింగ్ ఏర్పాటు చేస్తుండగా, ఇంటి పైనుంచి వెళ్తున్న హై టెన్షన్ వైర్ తగిలి అభి(14) అనే బాలుడి శరీరం పూర్తిగా కాలిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. కాగా, అభి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కుల గణన కోసం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం: మంత్రి పొన్నం



**మహా, హైదరాబాద్ :**
కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో భాగంగా రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు.. దేశంలో మొదటిసారి సమగ్ర కుల గణన ప్రక్రియ ఈనెల 6 వ తేదిన ప్రారంభమవుతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. సమగ్ర సర్వే సక్రమంగా జరిగి భవిష్యత్‌లో అందరికి సమ న్యాయం జరిగేలా అందరు సహకరించాలన్నారు. దీనికి సంబంధించి త్వరలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ఉన్న కాంగ్రెస్ నాయకులు కూడా గ్రామీణ ప్రాంతాలలో అధికారులకు సహకరించాలని సూచించారు. 150 ఇళ్లకు అధికారుల బృందం సమగ్ర సమాచార సేకరణ చేపడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు అన్ని రకాలుగా అందుబాటులో ఉండాలన్నారు.